క్లుప్తంగా

సీఐల బాధ్యతల స్వీకరణ


క్రిష్ణమోహన్


శ్రీనివాసులు

పూతలపట్టు/బంగారుపాళెం : పూతలపట్టు సీఐగా క్రిష్ణ మోహన్, బంగారుపాళెం అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ సీఐగా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. పూతలపట్టులో పని చేస్తున్న సీఐ సుదర్శనప్రసాద్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. చిత్తూరు వీఆర్‌లో వున్న క్రిష్ణమోహన్‌ను పూతలపట్టుకు బదిలీ చేశారు. అలాగే బంగారుపాళెంలో విధులు నిర్వహిస్తున్న సీఐ లక్ష్మయ్య చిత్తూరు వీఆర్‌కు వెళ్లారు. వీఆర్‌లో ఉన్న శ్రీనివాసులు బంగారుపాళెం సీఐగా బదిలీ అయ్యారు.

కొదలమడుగులో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని కొదలమడుగులో గురువారం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఉదయం గ్రామానికి చెందిన ప్రభోదానంద భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం కృష్ణుడి ప్రతిమను విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. బంగారుపాళెంలో శుక్రవారం మధ్యాహ్నం శ్రీకృష్ణ భగవానుడి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం

పూతలపట్టు: ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ధనలక్ష్మీ తెలిపారు. ఆమె గురువారం తేనేపల్లి, కొత్తకోట లేఅవుట్లలోని ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. మండలంలో 415 ఇళ్ల నిర్మాణాల పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేయడానికి కృషి చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం పూతలపట్టులోని పెద్దచెరువు కట్టను పరిశీలించి ముళ్ల పొదలు తొలగించాలని, ప్రజలు వెళ్లడానికి సౌకర్యం కల్పించాలని తెలిపారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి

తవణంపల్లె: డెంగీ జ్వరం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు మలేరియా అధికారి రామచంద్రారెడ్డి సూచించారు. ఆయన గురువారం దిగువమోదలపల్లె హరిజనవాడలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉన్న తొట్టెలను గుర్తించి లార్వాను గుర్తించి నీరు పారబోయించారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మందు పిచికారీచేయించారు. పారిశుద్ధ్యం మెరుగుపరచాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ దోమల వ్యాప్తి చెందకుండా లార్వా దశలోనే అంతమొందించాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి పీరుసాహెబ్, వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీవారి, రాజశేఖర్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



వైద్యులంటే ప్రాణాలను కాపాడేవారని ప్రజలంతా నమ్ముతారు. అలాంటి మహిళా వైద్యులపై దుర్మార్గపు చర్యలకు పాల్పడడం హేయమైన చర్య. భవిష్యత్‌లో ఎవరూ ఇటువంటి చర్యలకు పాల్పడకుండా నిందితులకు కఠిన శిక్ష విధించాలి. కాపాడే వైద్య వృత్తిలో ఉన్న మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే దుర్మార్గులను సమాజం నుంచి వెలి వేయాలి.

–శోభ, వైద్య సంఘ నాయకురాలు, చిత్తూరు



ఆకలేస్తే పరుగు పెట్టాలి



నైట్ డ్యూటీ అంటే రాత్రి 8 గంటలకు రావాలి. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు వెళ్లాలి. టీ, కాఫీ కావాల్సి వస్తోంది. అలాగే ఆకలి కూడా ఉంటుంది. ఈ సమయంలో తిండికోసం పాత బస్టాండు లేదా కొత్త బస్టాండులోని హోటళ్లకు వెళ్లాలి. మహిళలు వెళ్లాలంటే ఇబ్బంది. కోల్‌కతా ఘటనను చూసైనా ఆస్పత్రి ఆవరణలోనే క్యాంటిన్ ఏర్పాటు చేయాలి.

– సందీప్, జూనియర్ డాక్టర్, చిత్తూరు

నడకతో ఆరోగ్యం పదిలం

నేడు ప్రజలు యాంత్రిక జీవనానికి అలవాటు పడ్డారు. శారీరక శ్రమను బాగా తగ్గించేశాడు. ఫలితంగా స్థూలకాయం వస్తోంది. చిన్నవయస్సులోనే బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ జాడ్యాలను వదిలించుకోవాలంటే నడక ఒకటే మార్గమని వైద్యులు సూచిస్తున్నారు. ఇటీవల కాలంలో చాలా మంది ఉదయం, సాయంత్రం నడుస్తున్నారు. వ్యక్తి సామర్థ్యాన్ని బట్టి రోజులో అరగంట నుంచి గంట పాటు వాకింగ్ చేస్తున్నారు. వాకర్స్ అసోసియేషన్స్ కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. బంగారుపాళెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం, బైపాస్ రోడ్డు, ఎర్రాండ్లపల్లె రోడ్డు, సర్వీసు రోడ్డుపై ఎక్కువ మంది నడుస్తున్నారు. –బంగారుపాళెం

- రోజూ గంట వరకు వాకింగ్ ఉత్తమం
- నియంత్రణలోకి దీర్ఘకాలిక వ్యాధులు
- మైదానంలో పెరుగుతున్న వాకర్లు


వాకింగ్ చేస్తున్న వాకర్లు

ఒక మైలు దూరాన్ని 13 నిముషాలు, అంతకన్నా తక్కువ సమయం నడిస్తే శరీరంలో వంద క్యాలరీలు ఖర్చు అవుతాయి. ఈ లెక్కన ఎంత బరువు తగ్గాలన్నా, దానికి ఎన్ని మైళ్లు నడవాలో మీరే నిర్ణయించుకోవచ్చు. ఉదయం సమయంలో సూర్యకిరణాలు శరీరానికి విటమిన్–డి అందేలా చూస్తాయి. ఆ విటమిన్ కూడా బరువు తగ్గేందుకు సహకరించడంతో పాటు గుండెకూ మేలు చేస్తోంది. ఉదయాన్నే నిద్రలేవడం వల్ల జీవక్రియల రేటు సక్రమంగా ఉంటుంది. నీళ్లు ఎక్కువ తాగడం వల్ల శరీరంలో కొవ్వు, కేలరీలు అధికంగా కరుగుతాయి. బీపీ నియంత్రణ ఉంటుంది. కొన్ని క్యాన్సర్ వ్యాధులు రాకుండా ఉంటాయి. షుగర్ వ్యాధి ఉన్న వారికి బాగా పనిచేస్తోంది. మానసిక స్థితిని బలపరుస్తోంది. ఎముకలను గట్టిగా, దృఢంగా చేస్తోంది.

జాగింగ్ ఇలా చేయాలి

పరుగుతో ఆరోగ్యంతో పాటు శరీరాకృతిలోనూ మార్పులు వస్తాయి. తొడలు, పిరుదులు, పొట్ట చుట్టూ ఉండే కొవ్వు పదార్థాలు కరిగిపోతాయి. వలయాకారంలో ఉండే ట్రాక్‌లో 40 నిముషాల్లో నాలుగు కిలో మీటర్లు పరిగెత్తాలని నిపుణులు చెబుతున్నారు. ఇలా పరిగెత్తేటప్పుడు..మొదట వార్మప్ కోసం నాలుగు రౌండ్లు (రౌండ్ 400 మీటర్లు)మామూలుగా నడవాలి. తర్వాత రెండు రౌండ్లు నడక లాంటి పరుగుతో వెళ్లాలి. ఒక రౌండు వేగవంతమైన నడక, రెండు రౌండ్లు నడక లాంటి పరుగు చేయాలి. తర్వాత ఒక రౌండు వేగం పెంచి నడిచి, ఒక రౌండు కాస్త తక్కువ వేగంతో నడవాలి. చివరగా రెండు రౌండ్లు సాధారణమైన నడకతో వ్యాయామం ముగించాలి.

బీపీ నియంత్రణలోకి వచ్చింది

నేను ఏడేళ్ల నుంచి వాకింగ్ చేస్తున్నాను. మొదట్లో బీపీ మొదలైందని డాక్టర్ వద్దకు వెళ్లాను. డాక్టర్ సూచన మేరకు రోజూ వాకింగ్ ప్రారంభించాను. అప్పట్లో బరువు కాస్త ఎక్కువగా ఉండేవాన్ని. ఇప్పుడు బరువు తగ్గడంతో పాటు బీపీ నియంత్రణలోకి వచ్చింది. బాడీ ఫిట్‌నెస్ కూడా బాగుంది.

–సుబ్రమణ్యం, బంగారుపాళెం

గుండె జబ్బులు రావు

క్రమం తప్పకుండా నడవడం వల్ల శరీర బరువుతో పాటు కొలెస్ట్రాల్, బీపీ, షుగర్ నియంత్రణలోకి వస్తాయి. దీనివల్ల గుండె జబ్బులు, గుండెపోటుకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ రోజూ ఉదయాన్నే అరగంట నుంచి గంట పాటు వాకింగ్ చేయడం ఎంతో ఉత్తమమైన వ్యాయామం.

–డాక్టర్ శిరీష, సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి

కార్యకర్తలకు అండగా ఉంటాం


నందయ్యకు చెక్కు ఇస్తున్న సునీల్‌కుమార్

పూతలపట్టు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఆ పార్టీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన నందయ్యకు పార్టీ ఇచ్చిన రూ.50 వేల చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని తెలిపారు. ఎవరూ నిరాశచెందవద్దని, పార్టీ కోసం పనిచేయాలని, కూటమి ప్రభుత్వంతో మోసపోతున్న ప్రజలను కాపాడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనే ధ్యేయం

గుడిపాల: క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయమని గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య తెలిపారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో ఉపేంద్ర, ఎంఈవో రామ్‌నాయక్‌కు గురువారం వైద్య సిబ్బంది క్షయ వ్యాధి రాకుండా ముందస్తుగా బీసీజీ వ్యాక్సిన్ వేశారు. అనంతరం ప్రజలకు వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. సిబ్బంది జబసెల్వి, ఉమా, చంద్రశేఖర్, సుజమ, స్వప్న పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు




గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష, వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

గుడిపాల: మండలంలోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని బొమ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి అనూష తెలిపారు. శ్రీరంగంపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటి వద్ద మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది అన్నపూర్ణ, శిరీష, శివగామి, శశి పాల్గొన్నారు.

పేదలందరికీ వైద్య సేవలు

తవణంపల్లె: పేదలందరికీ మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. గురువారం మండలంలోని దిగువమోదాలపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజలకు ఆరోగ్యా సూత్రాలు గురించి వివరించారు. గర్భవతులు రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీహరి, రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసలు పాల్గొన్నారు.

నేడు వన మహోత్సవం

చిత్తూరు కార్పొరేషన్: అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎఫ్ఆర్వోలు థామస్, బాలకృష్ణారెడ్డి తెలిపారు. చిత్తూరులోని నగరవనం, అరగొండ ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు చిత్తూరులో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు పాల్గొంటారని తెలిపారు.

కౌమారదశలో పౌష్టికాహారం తప్పనిసరి

గుడిపాల: కౌమారదశలో ఉన్న బాలికలు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య తెలిపారు. నరహరిపేట హైస్కూల్‌లో గురువారం రాష్ట్రీయ కిశోర స్వస్థత కార్యక్రమంలో భాగంగా కౌమార దశ బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, కోడిగుడ్లు ఎక్కువగా తీసుకోవడం ద్వారా రక్త హీనతను నివారించవచ్చన్నారు. అనంతరం శానిటరీ ప్యాడ్స్ అందజేశారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- వ్యక్తికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడిన రవి

బంగారుపాళెం: మండలంలోని కేజీసత్రం(కుపాల గుర్రప్ప సత్రం) వద్ద గురువారం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. దీంతో యాదమరికి చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. యాదమరి మండలం జంగాలపల్లె ఎస్టీ కాలనీకి చెందిన రవి ద్విచక్ర వాహనంలో సొంతపని నిమిత్తం కేజీ సత్రానికి బయలుదేరాడు. కేజీ సత్రం వద్ద రహదారి మలుపు తిరుగుతుండగా పలమనేరు నుంచి చిత్తూరు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రవి కాలు విరిగిపోయింది. అతన్ని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జ్వరంతో వచ్చి మహిళ మృతి


కవిత మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జ్వరంతో వచ్చిన మహిళ డాక్టర్ల నిర్లక్ష్యంతో మృతి చెందిందని బాధిత కుటుంబీకులు రోదించారు. గంగాధర నెల్లూరు మండలం ఆత్మకూరుకు చెందిన కవిత(36) గురువారం తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబీకులు ఆమెను చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. గంట సమయానికి ఆమె ఊపిరాడక చనిపోయింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే కవిత మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబీకులు అత్యవసర విభాగం ఎదుట మృతదేహాన్ని ఉంచి నిరసన చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే సంబంధిత వ్యక్తులు అక్కడికి చేరుకుని ఆస్పత్రి సిబ్బంది, వైద్యులపై ప్రశ్నల వర్షం కురిపించారు. వైద్యులు దీనిపై వివరణ ఇస్తూ తక్షణం ప్రాథమిక చికిత్స అందించామని, ఊపిరితిత్తుల సమస్య కారణంగా ఆమె చనిపోయినట్లు తెలిపారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. చిత్తూరులోని మెసానికల్ మైదానంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో బాల, బాలికలు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పూతలపట్టు, బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంట, యాదమరి, పుంగనూరు మండలం పుదిపట్ల జెడ్పీ హైస్కూల్‌కు క్రీడా ప్రతిభా అవార్డులు అందజేశారు. డీఎస్‌డీఓ బాలాజీ, డీవైఈఓ చంద్రశేఖర్, జిల్లా ఒలంపిక్స్ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, బాస్కెట్‌బాల్ సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ సంజయ్‌గాంధీ నగర్‌లో ఉన్న ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి బాస్కెట్‌బాల్ ఆడారు.

బంగారుపాళెంలో ఎంపీ పర్యటన

బంగారుపాళెం: చిత్తూరు ఎంపీ ప్రసాద్‌రావు గురువారం బంగారుపాళెం మండలంలో అనధికారంగా పర్యటించారు. కేఎం కండ్రిగ సమీపంలో క్వారీని పరిశీలించారు.

మాతృభాష మహోన్నతమైనది





బంగారుపాళెం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు కవుల చిత్రపటాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గుడిపాల: మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, తవణంపల్లె హైస్కూల్‌లో విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

బంగారుపాళెం: మాతృభాష మహోన్నతమైనదని బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రాధాకృష్ణ తెలిపారు. వ్యవహారిక భాషకు ఆద్యుడైన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగుభాష గొప్పదనాన్ని చాటేందుకు కృషి చేసిన కవుల సేవలను కొనియాడారు. తెలుగు భాషను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మాతృభాషతో పాటు దేశంలోని ఇతర ప్రాంతీయ భాషలను నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు బహు భాషలపై పట్టుసాధిస్తే భవిష్యత్‌లో ఉపాధి కోసం ఏ ప్రాంతానికి వెళ్లినా తమ భావాలను వ్యక్తపరిచేందుకు దోహదపడతాయన్నారు. మండలంలోని టేకుమంద, మొగిలిమిట్టూరు, రాగిమానుపెంట, తుంబకుప్పం, మంగళపల్లె, గుండ్లకట్ట మంచి, పిడివి కండ్రిగ, బోడబండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్టీ గురుకుల పాఠశాలలో వ్యవహారిక భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు తెలుగు భాష ఔన్నత్యానికి కృషి చేసిన కవుల చిత్రపటాలను ప్రదర్శించారు. తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, పద్య పఠన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అదే విధంగా ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా పాఠశాలల్లో క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

దేశభాషలందు తెలుగు లెస్స

తవణంపల్లె: దేశభాషలందు తెలుగు లెస్స అని ఎంఈవో హేమలత కొనియాడారు. స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను జరుపుకున్నారు. గిడుగు రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూజలు చేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


బంగారుపాళెం: మంగళపల్లెలో బహుమతులు అందుకున్న విద్యార్థులు


బృందావన్ పాఠశాలలో


తవణంపల్లె సైకిల్‌పై స్వారీ చేస్తున్న విద్యార్థులు


చిత్తూరు విజయం పాఠశాలలో..

తెలుగు మాధుర్యాన్ని జగతికి చాటుదాం

గుడిపాల: తెలుగు మాధుర్యాన్ని ప్రపంచానికి చాటి, తెలుగు ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలని గుడిపాల తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గుడిపాలలోని సీఎన్ఆర్ కళాశాలలో గురువారం కరస్పాండెంట్ లోకేష్ అధ్యక్షతన తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రాంథిక భాషను వాడుక భాషలోకి తెచ్చిన ఘనుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని కొనియాడారు. తెలుగుభాష మాధుర్యాన్ని అనుభవించి విద్యార్థులు మాతృభాష పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. ఎన్ని భాషలు నేర్చినా తెలుగుభాషను మరువరాదని పిలుపినిచ్చారు. ప్రిన్సిపాల్ రామచంద్ర, తెలుగు అధ్యాపకులు అర్జున్ మాట్లాడుతూ విద్యార్థులు మాతృదేశాన్ని, మాతృభక్తిని గౌరవించే సంస్కారం అలవర్చుకోవాలని కోరారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు కీర్తి అజరామరణం అన్నారు. తెలుగు ఔన్నత్యం కోసం ఎందరో కృషిచేశారని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ వంశీకృష్ణ, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగుభాష మధురమైనది

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు నగరంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జీవనజ్యోతి మాట్లాడుతూ తెలుగు భాష మన సంపద, సంస్కృతి అని అన్నారు. గిడుగు రామ్మూర్తి తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో సేవలందించారని పేర్కొన్నారు. తెలుగు అధ్యాపకులు గోపీనాయక్ మాట్లాడుతూ తెలుగు భాషను సంరక్షించుకోవడంలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ మీరా సాహెబ్, విశ్రాంత బ్యాంక్ అధికారి అశోక్ కుమార్, హరివిల్లు గౌరవాధ్యక్షులు హరినాయుడు పాల్గొన్నారు. అలాగే నగరంలోని సంతపేట వద్ద ఉన్న బృందావనం పాఠశాలలో విద్యార్థులు వేషధారణలో ఆకట్టుకున్నారు. చైర్మన్ శైలజ, డైరెక్టర్ ప్రియ పాల్గొన్నారు. నగరంలోని ఎస్టేట్ వద్ద ఉన్న విజయం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల డైరెక్టర్ శైలజ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సస్య రక్షణతో మామిడిలో అధిక దిగుబడి

బంగారుపాళెం: మామిడి తోటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చిత్తూరు ఏరువాక కేంద్రం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు సంధ్యారాణి, వజంత, నాగమణి సూచించారు. వారు గురువారం జయంతిలో రైతు చిన్నవీరమ్మ మామిడి తోటను పరిశీలించారు. వారు మాట్లాడుతూ జూన్, జూలై నెలల్లో కురిసిన వర్షాలకు మామిడి చెట్లలో కొత్త చిగురు వచ్చిందన్నారు. వాటి నివారణ చర్యలు వివరించారు. ఏడీఏ నాగపద్మని, డివిజన్ ఏడీఏ ఉమ, ఏవోలు చిట్టిబాబు, లక్ష్మీప్రసన్న, ఉద్యానశాఖాధికారి సాగరిక, ఏఈవో సాదరయ్య పాల్గొన్నారు.

నోటీసులు ఇచ్చాం

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు విద్యుత్ డివిజన్‌లో విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుళ్లు తొలగించాలని నిర్వాహకులకు నోటీసులు ఇచ్చినట్లు ఈఈ మునిచంద్ర తెలిపారు. విద్యుత్ ప్రమాదాలపై ఆ శాఖ నిర్లక్ష్యంపై గురువారం సాక్షి దినపత్రికలో 'ఎటుచూసినా నిర్లక్ష్యమే' అన్న శీర్షికన కథనం ప్రచురితమైనది. దీనిపై ఈఈ స్పందించారు. వారు తొలగించకపోతే తమ సిబ్బందితో తొలగిస్తామని హెచ్చరించామన్నారు.

